# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY — సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 313 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | ఆదివారం 21 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

## వీడియో కాన్ఫరెన్స్‌లో విచారించలేం..

# ప్రభాకర్ రావును పట్కరండ్రి!

### ఆయనే ప్రధాన నిందితుడు

### శ్రవణ్ రావు ఆచూకీ కనుక్కోండి

### ఫోన్ ట్యాపింగ్ కేసులో నాంపల్లి కోర్టు

### అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతున్న పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావును కోర్టులో ప్రత్యక్షంగా హాజరు పర్చాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఈ కేసును ఇవాళ విచారించిన కోర్టు ఏ1గా ఉన్న ప్రభాకర్ రావు హాజరు కాకుండా ఎలా విచారణ చేపట్టాలని పోలీసులను ప్రశ్నించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏ1 ను విచారించలేమని చెప్పింది. అలాగే ఫోన్ ట్యాపింగ్ కోసం పరికరాలను కొనుగోలు చేసిన మీడియా సంస్థ అధినేత శ్రవణ్ రావు ఆచూకీ కనుక్కొని ప్రత్యక్షంగా హాజరు పర్చాలని ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఏ1గా ఉన్న ప్రభాకర్ రావు, ఏ6గా ఉన్న శ్రవణ్ రావుపై ఇప్పటికే వారెంట్లు జారీ అయినందున తదుపరి విచారణ నాటికి కోర్టులో హాజరు పర్చాలని సూచించింది. తన క్లయింట్ అనారోగ్యం కారణంగా అమెరికాలో చికిత్స పొందుతున్నారని, వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరవుతారంటూ ప్రభాకర్ రావు




తరపు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభాకర్ రావును రప్పించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు , శ్రవణ్ రావులను ఇండియాకు రప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కాగా, శ్రవణ్‌రావు ఆచూకీని దర్యాప్తు బృందం కనిపెట్టలేకపోయింది.

వివరాలు 2లో..



## కేసీఆర్ అధికారంలో ఉండగానే మేడిగడ్డ కుంగింది

### ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకూడదని భావిస్తున్నామన్న మంత్రి

### బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంను అట్టహాసంగా చేపట్టిందని విమర్శ

### కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆరోపణ

**హైదరాబాద్ పెన్ పవర్:**కేసీఆర్ అధికారంలో ఉండగానే మేడిగడ్డ కుంగిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజల అమూల్యమైన సొమ్ముతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారన్నారు. శనివారం మధ్యాహ్నం ఆయన నేషనల్ డ్యామ్ సేఫ్టీ మీటింగ్‌కు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...

వివరాలు 2లో..

## ఐఐటీ మద్రాస్ నుంచి డాక్టరేట్ అందుకున్న ఇస్రో చైర్మన్

### మెకానికల్ ఇంజినీరింగ్ లో పరిశోధనలు చేసిన సోమనాథ్

### ఐఐటీ స్నాతకోత్సవంలో పట్టా అందుకున్న ఇస్రో చైర్మన్

### పీహెచ్ డీలను అందుకున్న మొత్తం 444 మంది అభ్యర్థులు



పెన్ పవర్ డెస్క్:ఐఐటీ మద్రాస్ నుంచి ఇస్రో చైర్మన్ సోమనాథ్ పీహెచ్ డీ పట్టాను స్వీకరించారు. మద్రాస్ ఐఐటీ స్నాతకోత్సవంలో ఆయన ఈ పట్టాను అందుకున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ లో పరిశోధనలకు జరిపినందుకు గాను సోమనాథ్ కు పీహెచ్ డీ ప్రదానం చేసినట్టు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి తెలిపారు. మొత్తం 444 మంది అభ్యర్థులు పీహెచ్ డీలను స్వీకరించగా వారిలో సోమనాథ్ కూడా ఉన్నారు.

## రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారు



### నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందన్న కిషన్ రెడ్డి

### వంద రోజుల్లో హామీలను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని నిలదీత

### రాష్ట్రంలో జెండా మాత్రమే మారిందన్న కేంద్రమంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు.

వివరాలు 2లో..

## నాయకత్వానికి బ్రాండ్ ఎన్టీఆర్..

## నేను ఆ లైబ్రరీలోనే చదువుకున్న

### కమ్మ అంటేనే అమ్మలాంటి ఆప్యాయత

### హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములు కండి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** నాయకత్వానికి ఎన్టీఆర్ ఒక బ్రాండ్ క్రియేట్ చేశారని, ఎంతో మందికి రాజకీయంగా అవకాశాలు ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఎన్టీఆర్ లైబ్రరీలోనే చదువుకున్నానని చెప్పారు. తమను ఉన్నత స్థానంలో నిలబెట్టింది



వివరాలు 2లో..

## 25న తెలంగాణ కేబినెట్ భేటీ

### 25న ఉదయం అసెంబ్లీ కమిటీ హాలులో కేబినెట్ భేటీ

### వాస్తవిక అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించాలని ఆర్థిక శాఖకు ప్రభుత్వం సూచన

### వంద శాతం వ్యయం లక్ష్యాన్ని సాధించేలా బడ్జెట్ రూపకల్పన చేయాలన్న ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 25న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 25న ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై ప్రతిపాదనలపై చర్చించి బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది.



బడ్జెట్‌ను వాస్తవిక అంచనాలతో రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక శాఖకు సూచించింది. ఆదాయ, వ్యయాలపై భారీ అంచనాలతో కాకుండా ఎంతమేరకు ఆదాయం వస్తుందనేది పక్కాగా లెక్కలు వేసి అంతమేరకు కేటాయింపులతో రూపొందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. తెలంగాణ ఏర్పడిన

వివరాలు 2లో..

## కేరళలో 14 ఏళ్ల బాలుడికి నిఫా వైరస్ నిర్ధారణ

### పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీలో శాంపుల్స్ పరీక్షించగా పాజిటివ్

### కేరళ వైద్య శాఖ మంత్రి వీణా జార్జ్ ప్రకటన

### వైరస్ కేంద్రమైన పండిక్కాడ్‌తో పాటు చుట్టుపక్కల ప్రజలకు అప్రమత్తత ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో మరోసారి నిఫా వైరస్ కలకలం రేగింది. కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన ఓ 14 ఏళ్ల బాలుడికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని కేరళ వైద్య శాఖ మంత్రి వీణా జార్జ్ ప్రకటించారు. బాలుడి శాంపుల్స్‌ను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీలో (ఎన్ఐవీ) పరీక్షించామని వెల్లడించారు.బాలుడు ప్రస్తుతం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స





వివరాలు 2లో..

## హైదరాబాద్ ను వదలని వాన..

## మరో రెండు రోజులు అలర్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలోనూ ఉదయం నుంచి ముసురు కంటిన్యూ అవుతోంది. ఆగకుండా కురుస్తున్న వర్షంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావటంతో



వివరాలు 2లో..

## పవన్ చాలా జాగ్రత్తగా ఉండాలి...

## కేంద్ర నిఘా సంస్థల హెచ్చరిక!

### కొన్ని అవాంఛనీయ గ్రూపుల్లో పవన్ ప్రస్తావన వస్తోందన్న నిఘా వర్గాలు

### పవన్ ను కొన్ని గ్రూపులు టార్గెట్ చేసినట్టు గుర్తింపు

### ఆ గ్రూపులు ఎవరివి అనేది ఇప్పుడే చెప్పలేమన్న నిఘా వర్గాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. కొన్ని అవాంఛనీయ గ్రూపుల్లో పవన్ కల్యాణ్ ప్రస్తావన వచ్చిందని, ప్రతి నిమిషం జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశాయి.



వివరాలు 2లో..

## సంపాదకీయం

### వర్షాకాలంలో ఏ రంగు డ్రస్ లు వేసుకోవాలో తెలుసా..

చాలామంది కాలంతో సంబంధం లేకుండా నచ్చిన దుస్తులు వేసు కుంటుంటారు. కానీ కొన్నిసార్లు ఆ ఇష్టాలే ఇబ్బందులకు దారితీస్తాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఎదురవుతాయి. వర్షంలో తడి సినప్పుడు దుస్తుల తడి వల్ల స్కిన్ ఇన్ ఫెక్షన్స్ కూడా వస్తాయి. ఇలాంటి సమస్యలు ఎదురవకుండా ఉండాలంటే ఈ సీజన్? తగ్గట్టుగా డ్రెస్? లను ఎంచుకోవాలి. అలాగే ఈ కాలంలో హెయిర్ స్టైల్స్, జువెలరీ విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ కాలంలో అమ్మాయిలు పాదాల వరకు ఉండి, నేలకు తాకే గౌన్లు, సల్వార్స్ పటియాల వంటి డ్రెస్?ల జోలికి వెళ్లకుండా ఉంటే మంచిది. అలాగే ఒంటికి అతుక్కు పోయేలా ఉండే డ్రెస్లకు దూరంగా ఉంటే వాన కురిసినా ఇబ్బంది ఉండదు. జీన్స్, వదులుగా ఉండే స్కర్ట్స్, బాగా బరువుండే దుస్తులు కూడా వర్షాకాలంలో సౌకర్యంగా ఉండవు.

**ఈ రంగుల్లో...**

వర్షాకాలంలో వాతావరణం మబ్బులు పట్టి డల్?గా కనిపిస్తుంది. అందువల్ల మనలోనూ కాస్త ఆ డల్ ఫీలింగ్ ఉంటుంది. దీంతో చేసే పనుల మీద కూడా అంత ఏకాగ్రత ఉండదు. అందుకే ఈ సీజన్లో ఉత్సాహాన్నిచ్చే రంగులు సెలెక్ట్ చేసుకుంటే మంచిది. అంటే, కలర్ ఫుల్ డ్రెస్లన్నమాట! ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల దుస్తులు పరిసరాలను కాంతివంతంగా చేస్తాయి. అందుకే ఇలాంటివి చాలా బెటర్. ఒకవేళ డార్క్ కలర్స్ నచ్చకపోతే లైట్ కలర్ దుస్తులు వేసుకుని వాటిపై డార్క్ కలర్ స్కార్ఫ్ కట్టు కుంటే అదిరిపోతుంది.

**జువెలరీ కేర్**

వర్షాకాలంలో బంగారం, వజ్రాల నగలకు ఎలాంటి హాని జరగకపోవచ్చు కానీ.. వెండి నగల విషయంలోనే జాగ్రత్తలు తీసు కోవాలి. అవి వర్షాకాలంలో త్వరగా రంగు మారతాయి. అందుకే వాటిని టిష్యూ లేదా నూలు వస్త్రంలో చుట్టి జిప్ లాక్ బ్యాగుల్లో భద్రపరుచుకోవాలి. అలాగే వాటిని గాలి, వెలుతురు తగలని చోట ఉంచాలి.

**హెయిర్ స్టైల్స్**

ఈ కాలంలో హెయిర్ స్టయిల్?ను సింపుల్ గా ప్లాన్ చేసుకోవాలి. కొన్ని రకాల హెయిర్ స్టయిల్స్ వాతావరణ పరిస్థితుల వల్ల చెదిరిపోయి చికాకు తెప్పిస్తాయి. అందుకే ఈ కాలంలో జుట్టు ఆరోగ్యాన్ని కాపాడే హెయిర్ స్టయిల్ని ఎంచుకోవడం మంచిది. సన్న పాయలు తీసి బట్టర్ ఫ్లై క్లిప్ పెట్టి మిగిలిన జుట్టుని లూజుగా వదిలేయడం.. హై పోనీ... లేదా పిగ్టెల్ నిట్రై చేయొచ్చు. అలాగే వర్షాకాలంలో మంచి హెయిర్ వాషెస్ లేదా లైట్ హెర్బల్ షాంపూలతో తలస్నానం చేయాలి. కండిష నర్?ని ఎక్కువగా వాడకూడదు.

## నాయకత్వానికి బ్రాండ్ ఎన్టీఆర్.. నేను ఆ లైబ్రరీలోనే చదువుకున్న

- మొదటి పేజి తరువాయి

ఆయన నాయకత్వమేనని చెప్పారు. దేశంలో సంకీర్ణ రాజకీయాలకు బాటలు వేసింది ఎన్టీఆరేనని చెప్పారు. ఆయన వల్లే చాలా మందికి రాజకీయ అవకాశాలు వచ్చాయని చెప్పారు. ఇవాళ హెచ్ఐసీసీలో నిర్వహించిన కమ్మ గ్లోబల్ సమ్మిట్ను సీఎం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కమ్మ సామాజిక వర్గం తనను ఎంతగానో అభిమానిస్తుందని చెప్పారు. కమ్మ అంటేనే కష్టపడే తత్వం ఉన్నవారని అర్థమన్నారు. అమ్మలాంటి ఆప్యాయత కమ్మ వారిలో ఉంటుందన్నారు. నేను నమ్ముకొని కష్టించి పనిచేస్తారని అన్నారు కష్టపడటం.. పది మందికి సాయపడటం కమ్మ వారి లక్షణమని అన్నారు. హైదరాబాద్ ను విశ్వనగరంగా అభివృద్ధి చేయడంలో భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. తమకు భేషజాలు లేవని, కమ్మవారిని అభిమానిస్తామని, ఇతర కులాలనూ గౌరవిస్తామని సీఎం చెప్పారు. తెలంగాణలో ఎవరిపైనా వివక్ష ఉండదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలుపడం హక్కు అని నిరసన తెలుపకుండా నియంత్రించాలనుకుంటే ఫలితాలు ఎలా ఉంటాయో మీరే చూశారని పరోక్షంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సీఎం గుర్తు చేశారు. వివాదంలో ఉన్న 5ఎకరాల కమ్మ సంఘం భూ సమస్యను

పరిష్కరిస్తామని చెప్పారు. భూసమస్యను పరిష్కరించడంతో పాటు సంఘం భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారు

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుంటోందన్నారు. ఆ పార్టీకి ప్రజలందరూ స్వస్తి చెబుతారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో చాలా అవినీతి జరుగుతోందన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలన్నారు. గతంలో ప్రజల తీర్పును కాలరాసి కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పని చేస్తోందన్నారు.

ప్రజావాణి వినిపించడంలో బీజేపీ కృషి చేస్తుందన్నారు. గ్రూప్ 1 మెయిన్స్కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను 2000కు పెంచాలన్నారు. 1365 గ్రూప్ 3 పోస్టులను 3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇవ్వాలన్నారు.

## కేసీఆర్ అధికారంలో ఉండగానే మేడిగడ్డ కుంగింది

- మొదటి పేజి తరువాయి

ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకూడదనే తాము భావిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును అట్టహాసంగా చేపట్టిందన్నారు. అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టిందని గుర్తు చేశారు. 16 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేలా ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నీళ్లు లేవనే కారణంతో మేడిగడ్డ దగ్గర కట్టారని మండిపడ్డారు. తుమ్మిడిహట్టి వద్ద కట్టి ఉంటే మరోలా ఉండేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్లను ప్రతిపాదించిందన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి కమీషన్ల కోసమే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం నిర్మించిందని ఆరోపించారు. అందుకోసం హైక్లాస్ లోన్స్ తీసుకు వచ్చారన్నారు. కాళేశ్వరం కట్టింది కమీషన్ల కోసమే అన్నారు. ఈ ప్రాజెక్టుతో లక్ష కోట్ల ప్రజాధనం వృథా అయిందన్నారు. ఇందుకు ప్రతి సంవత్సరం 10 వేల కోట్ల వడ్డీలు కడుతున్నామన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్‌లో విచారించలేం.. ప్రభాకర్ రావును పట్కరండ్రి!

- మొదటి పేజి తరువాయి

శ్రవణ్?రావు ఆచూకీ కోసం విదేశాలకు వెళ్లే యోచనలో దర్యాప్తు బృందం ఉన్నట్లు తెలుస్తోంది.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమంతా ప్రభాకర్ రావు కనుసన్నల్లోనే జరిగిందని, ఎస్ఐబీలో హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడంలోనూ ప్రభాకర్ రావే ప్రధాని సూత్రధారి అని సిట్ తేల్చింది. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ప్రణీత్ రావు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసినట్టు సిట్ నిర్ధారణకు వచ్చిన విషయం తెలిసిందే.

## హైదరాబాద్ ను వదలని వాన.. మరో రెండు రోజులు అలర్ట్

- మొదటి పేజి తరువాయి

నగరంలో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. హైదరాబాద్ తో పాటు శివారు ప్రాంతాల్లోనూ నిన్న సాయంత్రం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.

హైదరాబాద్ సహా ఖమ్మం, భద్రాద్రి, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లో జోరు వాన పడుతోంది. నదులు, కాలువలు, వాగులు ఉప్పొంగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మహాదేవపూర్, మహాముత్తారం, మలహార్, పలిమేల మండలాల్లో నిన్నటి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. వాగులు పొంగిపొర్లుతున్నాయి. కాటారం మండలం పోతులవాయి వాగు ఉధృతంగా ప్రవహించటంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భూపాలపల్లి కేటీకే 2, కేటీకే 3 ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వరద నీరు చేరడంతో 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడింది. 2 కోట్ల వరకు నష్టం జరిగింది. గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టుకు వరద పెరగడంతో అధికారులు 5 గేట్లు ఎత్తారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 76,238, ఔట్ ఫ్లో 60,986 క్యూసెక్కులుగా ఉంది. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు నీటి మట్టం 1091 అడుగులకు గాను 1066 అడుగులకు చేరింది. నల్గొండ, వికారాబాద్, నల్గొండ జిల్లాలో ఎడతెరపి లేని వర్షం పడుతోంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రిలోని ఉపరితల గనుల్లో నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

**31.5 అడుగులకు గోదావరి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలతో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా వణికిపోతుంది. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది.ప్రస్తుతం భద్రాచలం వద్ద ఇవాళ ఉదయం గోదావరి నీటి మట్టం 31.5 అడుగులకు చేరింది. గోదావరి నది స్నానఘట్టాల వరకు వరద నీరు చేరింది. తాలిపేరు ప్రాజెక్టు 20 గేట్లను ఎత్తి 66,900 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేశారు. 43 అడుగులు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కిన్నెరసాని జలాశయంలోకి 4 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. పగిడివాగు ఉధృతంగాగా ప్రవహిస్తోంది. మన్యంలో వాగులు వంకలు పొంగుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా రామచంద్రపురం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది.

**20 , 21వ తేదీల్లో భారీ వర్షాలు**

రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని తెలిపింది వాతావరణశాఖ. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది తీవ్ర వాయుగుండగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ ఇచ్చింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వాయుగుండం ప్రభావంతో జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

**కలెక్టర్లు అలర్ట్ గా ఉండాలె**

ఉత్తర తెలంగాణలోని 11 జిల్లాల్లో ఈ నెల 20 , 21వ తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్కారు అలర్ట్ అయ్యింది. ఆయా జిల్లాల కలెక్టర్లు అలర్ట్ గా ఉండాలని సీఎస్? శాంతికుమారి ఆదేశించారు. నిన్న రాత్రి టెలికాన్ఫరెన్స్ తో కలెక్టర్లు, జిల్లాల ఉన్నతాధికారులతో మాట్లాడారు.

## 25న తెలంగాణ కేబినెట్ భేటీ

- మొదటి పేజి తరువాయి

తర్వాత ఒక్కసారి కూడా బడ్జెట్ అంచనాల ప్రకారం వంద శాతం వ్యయం చేయలేదని, ఈ ఏడాది ఆ లక్ష్యాన్ని సాధించేలా రూపకల్పన చేయాలని సూచించింది.గత పదేళ్లలో 2019–20లో మాత్రమే బడ్జెట్ అంచనాల్లో 97.5 శాతం వ్యయమైనట్లు శ్వేతపత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది రాష్ట్ర ఆదాయ, రుణాల సేకరణ పెరుగుతున్నందున బడ్జెట్ రూ.2.50 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెడుతోంది.

## కేరళలో 14 ఏళ్ల బాలుడికి నిఫా వైరస్ నిర్ధారణ

- మొదటి పేజి తరువాయి

పొందుతున్నాడని వివరించారు. పర్యవేక్షణతో కూడిన చికిత్స కోసం అతడిని కోజికోడ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తరలిస్తామని ఆమె వివరించారు. బాలుడిని కాంటాక్ట్ అయిన వారిని గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, వైరస్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న వ్యక్తులను ఇప్పటికే వేరు చేశామని, వారి నమూనాలను సైతం పరీక్షల కోసం పంపామని వీణా జార్జ్ మీడియాకు వివరించారు. చికిత్స పొందుతున్న బాలుడు ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉన్నాడని ఆమె చెప్పారు.

నిఫా వైరస్ కేంద్రం పండిక్కాడ్ అని, ఇప్పటికే ముందుజాగ్రత్త చర్యలు ప్రారంభించామని పేర్కొన్నారు. వైరస్ కేంద్రం పండిక్కాడ్‌తో పాటు సమీపంలోని ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ముసుగులు ధరించాలని, ఆసుపత్రులలో పేషెంట్లను సందర్శించడం మానుకోవాలని సూచనలు చేసినట్టు మంత్రి తెలిపారు. కాగా గతంలోనూ నాలుగు సార్లు కేరళ రాష్ట్రాన్ని నిఫా వైరస్ వణికించింది. 2018, 2021, 2023లలో కోజికోడ్ జిల్లాలో, 2019లో ఎర్నాకులం జిల్లాలో నిఫా కేసులు నిర్ధారణ అయ్యాయి. కోజికోడ్, వయనాడ్, ఇడుక్కి, మలప్పురం, ఎర్నాకులం జిల్లాల్లోని గబ్బిలాలలో నిఫా వైరస్ యాంటీబాడీల ఉనికిని గుర్తించారు. కాగా నిఫా వైరస్ కరోనా కంటే ప్రమాదకరమైనదని నిపుణులు చెబుతున్నారు. గబ్బిలాల ద్వారా ఈ వైరస్ మనుషులకు సోకుతుంది.

## పవన్ చాలా జాగ్రత్తగా ఉండాలి... కేంద్ర నిఘా సంస్థల హెచ్చరిక!

- మొదటి పేజి తరువాయి

పవన్ ను టార్గెట్ చేసిన ఆ గ్రూపులు ఎవరివి అనేది ఇప్పుడే చెప్పలేమని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పవన్ కల్యాణ్ తన భద్రత పట్ల గట్టి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపాయి.

కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంలో, పవన్ కల్యాణ్ జడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఉండడం, ప్రధాని నరేంద్ర మోదీకి గట్టి మద్దతుదారు కావడంతో, ఆయనను మావోయిస్టులు లక్ష్యంగా చేసుకున్నారని కొన్ని వార్తలు వస్తున్నాయి. వీటిలో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.

## అమెరికాలో నిరసన తెలపచ్చు... ఏపీలో అక్రమ అరెస్ట్‌పై హైదరాబాద్‌లో మాత్రం తెలపకూడదా?: రేవంత్ రెడ్డి

పన్నులు కట్టే ప్రాంతంలో ప్రజలకు నిరసన తెలిపే హక్కు ఉంటుందని, నిరసనలను అణచివేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో డిసెంబర్ 3, 2023 ఫలితాలను చూశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నోవా హోటల్‌లో జరుగుతున్న కమ్మ గ్లోబల్ సమ్మిట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన గత ఏడాది ఏపీలో చంద్రబాబును అరెస్ట్ చేసిన సమయంలో హైదరాబాద్‌లో నిరసనలు వద్దని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి కమ్మ గ్లోబల్ సమ్మిట్‌లో స్పందించారు.

అమెరికాలోని వైట్ హౌస్ వద్ద తెలంగాణ కోసం నిరసనలు తెలుపవచ్చునని... కానీ ఏపీలోని అక్రమ అరెస్ట్‌లపై మాత్రం హైదరాబాద్‌లో నిరసన తెలపనీయలేదని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. నిరసన ప్రాథమిక హక్కు... కానీ ఏపీలో అక్రమ అరెస్టులపై తెలంగాణలో నిరసనలు తెలపాలనుకుంటే అడ్డుకున్నారని... ఇదే వారి (బీఆర్ఎస్ ప్రభుత్వం) పతనానికి దారి తీసిందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన ఒక పద్ధతి అన్నారు.

నిరసన తెలియజేస్తే నిర్బంధిస్తామంటే దాని ఫలితాలు డిసెంబర్ 3న చూశారన్నారు. కమ్మ సంఘానికి గత ప్రభుత్వం 5 ఎకరాల భూమి ఇచ్చినట్లే ఇచ్చి లిటిగేషన్ పెట్టినట్లుగా తనకు తెలిసిందని, కానీ అవన్నీ పరిష్కరించి, అక్కడ భవనం కట్టుకోవడానికి కమ్మ సంఘానికి అనుమతి ఇస్తామన్నారు.

## నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు

**పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందన్న హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

**వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం**

**ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు**




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఒడిశా, ఉత్తరాంధ్ర, తీరంలోని వాయవ్య బంగాళాఖాతంలో చిలికా సరస్సు వద్ద వాయుగుండం కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావం కారణంగా ఏపీతో పాటు తెలంగాణలోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది.

# రూ.373 కోట్లతో డైనోసార్ అస్థిపంజరాన్ని కొనుగోలు చేసిన బిలియనీర్

### వేలం రికార్డులు బద్దలు కొట్టిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'సిటాడెల్' అధినేత కెన్ గ్రిఫిన్

### 15 నిమిషాల వేలం పాటలో ఆరుగురితో పోటీపడ్డ సంపన్నుడు

### చెక్కుచెదరని అతిపెద్ద డైనోసార్ అస్థిపంజరంగా గుర్తింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'సిటాడెల్' వ్యవస్థాపకుడు, సీఈవో కెన్ గ్రిఫిన్ సుమారు రూ.373 కోట్లతో (44.6 మిలియన్ డాలర్లు) ఓ డైనోసార్ అస్థిపంజరాన్ని కొనుగోలు చేశారు. వేలం రికార్డులను బద్దలు కొడుతూ ఆయన ఈ డైనోసర్ అస్థిపంజరాన్ని దక్కించుకున్నారని 'న్యూయార్క్ పోస్ట్' కథనం పేర్కొంది. 'సోథెబైస్' అనే వేలం నిర్వహణ సంస్థ న్యూయార్క్‌లో బుధవారం నిర్వహించిన వేలంలో దీనిని దక్కించుకున్నారని తెలిపింది. కాగా ఆయన కొనుగోలు చేసిన డైనోసార్ అస్థిపంజరం అతి పెద్దదని, చెక్కుచెదరనిదని వివరించింది. వేలం చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక ధరకు అమ్ముడుపోయిన శిలాజ వస్తువు ఇదేనని తెలిపింది.

కాగా ఈ డైనోసార్ అస్థిపంజరం దాదాపు 150 మిలియన్ సంవత్సరాల పురాతనమైనదని అంచనా వేస్తున్నారు. ఈ భారీ అస్థిపంజరానికి 'అపెక్స్' అని పేరుపెట్టారు. కొలరాడోలోని డైనోసార్ అనే ప్రాంతానికి వెలుపల మే 2022లో తవ్వకాల చేపట్టిన పాలియోంటాలజిస్ట్ జాసన్ కూపర్ దీనిని గుర్తించారు. ఇప్పటివరకు కనుగొన్న డైనోసార్ అస్థిపంజరాల్లో 'అపెక్స్' అతి పెద్దదని వేలం నిర్వహణ సంస్థ 'సోథెబైస్' పేర్కొంది. దీని ఎత్తు 11 అడుగుల (3.3 మీటర్లు), 27 అడుగుల (8.2 మీటర్లు) పొడవు ఉందని తెలిపింది. మొత్తం 319 ఎముకలు ఉంటాయని అంచనా వేయగా అందులో 254 ఎముకలు చెక్కు చెదరకుండా ఉన్నాయని తెలిపింది.


కాగా 'అపెక్స్'ను దక్కించుకునేందుకు ఏకంగా ఆరుగురు పోటీపడ్డారు. 15 నిమిషాల పాటు వేలంపాట జరిగింది. కెన్ గ్రిఫిన్ అందరినీ అధిగమించి ఈ అస్థిపంజరాన్ని దక్కించుకున్నారు. నిజానికి ఈ అస్థిపంజరం 6 మిలియన డాలర్ల వరకు అమ్ముడుపోతుందని అంచనా వేశారు. కానీ ఏకంగా 44.6 మిలియన డాలర్లు పలకడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంచనా కంటే 11 రెట్లు అధిక ధర పలకడంతో రికార్డులు కూడా బద్దలయ్యాయి.కాగా ఫోర్బ్స్ ప్రకారం కెన్ గ్రిఫిన్ సంపద సుమారు 37.8 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనాగా ఉంది. ఆయన రిపబ్లికన్ పార్టీకి రెగ్యులర్‌గా డొనేట్ చేస్తుంటారని పేర్కొంది.

## 5 డోర్లతో మహీంద్రా నుంచి సరికొత్త 'థార్ రాక్స్'.. విడుదల తేదీ, ఇతర వివరాలు ఇవిగో

### ఆగస్టు 15న విడుదల చేయనున్నట్టు ప్రకటించిన మహీంద్రా అండ్ మహీంద్రా

### కనిష్ఠ ధర రూ.13 లక్షల నుంచి ప్రారంభం.. గరిష్ఠ ధర రూ.25 లక్షలు ఉండొచ్చని అంచనా

### థార్ విడుదలైన నాలుగేళ్ల తర్వాత కీలక అప్‌డేట్‌లు చేసిన కంపెనీ



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయ మార్కెట్లో మరో సరికొత్త వాహనం ఆవిష్కరణకు సిద్ధమైంది. 5 డోర్లతో 'మహీంద్రా థార్ రాక్స్'ను విడుదల చేయబోతున్నట్టు ఇవాళ(శనివారం) ప్రకటించింది. దీనిని ఆగస్టు 15న ఆవిష్కరించబోతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు కారు టీజర్‌ను విడుదల చేసింది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే తేదీన 'థార్'ను మార్కెట్‌లో ప్రవేశపెట్టామని పేర్కొంది. 'థార్ రాక్స్'లో కొత్త రెండు డోర్లు జత చేశామని, కారు పొడవు, వీల్‌బేస్ పెరిగాయని కంపెనీ వివరించింది. 'థార్ రాక్స్' డిజైన్‌ను కూడా ఆధునికీకరించామని వివరించింది. సర్క్యులర్ హెడ్‌లైట్లు, గ్రిల్ కూడా కొత్తవేనని తెలిపింది. కాగా కొన్ని మార్పులతో వచ్చినప్పటికీ నాలుగేళ్ల క్రితం విడుదలైన మహీంద్రా ఎస్‌యూవీ 'థార్'కు చెందినదే అనే భావం కలుగుతోంది.

**ధర రూ.13 లక్షల నుంచి ప్రారంభం!**

మహీంద్రా థార్ రాక్స్ ఆరంభ ధర సుమారు రూ.13 లక్షల నుంచి ప్రారంభమవ్వొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఇక గరిష్ఠ ధర ఎక్స్-షోరూమ్‌లో రూ.25 లక్షల వరకు ఉండొచ్చని కథనాలు పేర్కొంటున్నాయి. ఇక థార్ 5-డోర్ ప్రత్యేకతల విషయానికి వస్తే... 2.0 లీటర్ టర్బో-పెట్రోల్ మోటార్, 2.2లీటర్ డీజిల్ ఇంజన్ రెండు ఇంజన్ ఆప్షన్లకు అవకాశం ఉంది. 6-స్పీడ్ మాన్యువల్, 6-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లకు ఛాన్స్ ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. థార్ రాక్స్ ఒక 4%ఇ%4 డ్రైవ్‌ట్రెయిన్, తక్కువ నిష్పత్తిలో గేర్‌బాక్స్, వెనుక యాక్సిల్‌కు మెకానికల్ లాకింగ్ డిఫరెన్షియల్, ఫ్రంట్ యాక్సిల్‌కు బ్రేక్-లాకింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయని తెలుస్తోంది. మార్కెట్లో ధరలను పోటీగా ఉంచేందుకుగానూ టూ-వీల్ డ్రైవ్ వేరియంట్‌లను కూడా మహీంద్రా కంపెనీ ఆఫర్ చేయవచ్చునని కథనాలు పేర్కొంటున్నాయి.

## 35, 36 అంటున్నారు... ఆ లెక్కలు శుద్ధ తప్పు: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

### నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ సమావేశం

### హాజరైన టీడీపీ ఎంపీలు

### సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఇవాళ టీడీపీ పార్లమెంటరీ సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగిసిన అనంతరం నరసరావుపేట ఎంపీ, లోక్ సభలో టీడీపీ సభాపక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను ఉపేక్షించేది లేదని నేటి సమావేశానికి హాజరైన ఎంపీలకు, రాష్ట్ర మంత్రులకు స్పష్టం చేశారని వెల్లడించారు. ఈ సందేశాన్ని ఎమ్మెల్యేలకు కూడా చెప్పాలని చంద్రబాబు సూచించారని తెలిపారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పై స్వయంగా తానే దృష్టి పెడతానని, శాంతి భద్రతలను నెలకొల్పేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పారని లావు శ్రీకృష్ణదేవరాయలు వివరించారు.

"35, 36 (హత్యలు) అని వాళ్లు (వైసీపీ) చెబుతున్న లెక్కలు శుద్ధ తప్పు. 35, 36 అంటున్నారు కదా... దయచేసి వాళ్ల పేర్లు, అడ్రస్ లు ఇవ్వండి. ఏ పార్టీయో, కులమో, మతమో చూసే వ్యవహారం కాదిది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో న్యాయం వైపు నిలబడి ఉన్నాం. న్యాయం చేయడానికే ఉన్నాం. ఈ 35 నెంబరు అనేది అవాస్తవం. వినుకొండలో జరిగిన ఘటనను పూర్తిగా పక్కదోవ పట్టిస్తున్నారు. అది ఇవాళ్టి వివాదం కాదు. గత రెండేళ్లుగా ఆ గొడవ నడుస్తోంది. ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవకు రాజకీయ రంగు పులుముతున్నారు. హత్య చేసిన యువకుడు రాజకీయాల్లో పెద్దగా క్రియాశీలకంగా లేడు. ఇవాళ ఆరోపణలు చేస్తున్న జగన్... రెండేళ్ల క్రితమే వివాదం తలెత్తినప్పుడు ఎందుకు న్యాయం వైపు నిలబడలేదు? నాడు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఈ వివాదంలో ఒక గ్రూపుకు కొమ్ము కాసి, మరో గ్రూపుపై తప్పుడు కేసులు పెట్టించి, కొట్టించి, ఇబ్బందులకు గురిచేశారు. ఆ పర్యవసానంగానే వినుకొండ ఘటన జరిగింది. వినుకొండలో జరిగిన ఘటనలో వాస్తవాలు అందరికీ తెలుసు. టీడీపీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారు" అంటూ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

## గోదావరిలో కాంగ్రెస్ కుట్రలు కొట్టుకుపోయాయి: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ ట్వీట్

### కాళేశ్వరం సగర్వంగా తలెత్తుకొని సలాం చేస్తోందన్న కేటీఆర్

### గంగా ప్రవాహంలో లక్షల కోట్ల వృథా ఆరోపణలు గల్లంతయ్యాయన్న కేటీఆర్

### మేడిగడ్డే మన రైతుల కష్టాలు తీర్చే మేటిగడ్డ అన్న మాజీ మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో కాంగ్రెస్ కుట్రలే కొట్టుకుపోయాయని... కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం సగర్వంగా తలెత్తుకొని సలాం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. భారీ వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో కళకళలాడుతున్న వీడియోను కేటీఆర్ పోస్ట్ చేశారు.

పోటెత్తిన వరదకు దుష్టశక్తుల.. పన్నాగాలు పటాపంచలయ్యాయని... కానీ.. కేసీఆర్ గారి సమున్నత సంకల్పం.. జై కొడుతోంది.. జల హారతి పడుతోందని ఆయన పేర్కొన్నారు. లక్షల క్యూసెక్కుల గంగా ప్రవాహంలో.. లక్షకోట్లు వృథా చేశారనే విమర్శలు గల్లంతయ్యాయన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మాత్రం.. మొక్కవోని దీక్షతో నిలబడింది.. కొండంత బలాన్ని చాటిచెబుతోందని పేర్కొన్నారు.

ఎవరెన్ని కుతంత్రాలు చేసినా దశాబ్దాలుగా దగాపడ్డ ఈ తెలంగాణ నేలకు.. ఇప్పటికీ.. ఎప్పటికీ మేడిగడ్డే మన రైతుల కష్టాలు తీర్చే 'మేటి'గడ్డ అని పేర్కొన్నారు. కాళేశ్వరమే కరువును పారదోలే 'కల్పతరువు' అన్నారు. బురద రాజకీయాలను భూస్థాపితం చేసిన.. ఈ మానవ నిర్మిత అద్భుతానికి, నిర్మించిన కేసీఆర్ గారికి తెలంగాణ సమాజం పక్షాన మరోసారి సెల్యూట్ అన్నారు. జై తెలంగాణ... జై కాళేశ్వరం అని ముగించారు.

## సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ అందుకున్న అన్నా లెజినోవా... హాజరైన పవన్ కల్యాణ్

### సింగపూర్ వర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ పూర్తి చేసిన అన్నా లెజినోవా

### సింగపూర్ లో జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో పట్టా స్వీకరించిన వైనం

### సోషల్ మీడియాలో సందడి చేస్తున్న ఫొటోలు, వీడియోలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజినోవా సింగపూర్ లోని ఓ ప్రఖ్యాత యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. సింగపూర్ వర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ పూర్తి చేసిన అన్నా లెజినోవా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పట్టా అందుకున్నారు. సింగపూర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు దర్శనమిస్తున్నాయి. ఈ ఫొటోలు, వీడియోలను పవన్ అభిమానులు విపరీతంగా షేర్ చేస్తున్నారు.

## యూపీఐ పేమెంట్లకు ఎనలేని ఆదరణ.. ప్రతినెలా ఆశ్చర్యకర స్థాయిలో కొత్త వినియోగదారులు

### ప్రతి నెలా జత కలుస్తున్న 60 లక్షల మంది నూతన యూపీఐ చెల్లింపుదార్లు

### ఏడాది ప్రాతిపదికన 49 శాతం మేర పెరిగిన పేమెంట్లు

### రోజువారీగా యూపీఐ చెల్లింపుల మొత్తం విలువ రూ.66,903 కోట్లు

### గణాంకాలు విడుదల చేసిన ఎన్‌పీసీఐ





**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు అంతకంతకూ వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) పేమెంట్లకు ఎనలేని ఆదరణ పెరుగుతోంది. ప్రతి నెలా ఏకంగా 60 లక్షల మంది నూతన వినియోగదారులు యూపీఐ చెల్లింపులు మొదలుపెడుతున్నారని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) డేటా పేర్కొంది. ఈ మేరకు జూన్ నెల డేటాను ప్రకటించింది. ఏడాది ప్రాతిపదికన యూపీఐ లావాదేవీల సంఖ్య ఏకంగా 49 శాతం మేర పెరిగి 13.9 బిలియన్లకు చేరిందని తెలిపింది. ఇక లావాదేవీల విలువ 36 శాతం పెరిగి రూ.20.1 లక్షల కోట్లకు చేరిందని ప్రకటించింది.రోజువారీ యూపీఐ లావాదేవీల సంఖ్య 463 మిలియన్లు ఉంటుందని, రోజువారీ పేమెంట్ల సగటు విలువ రూ.66,903 కోట్లుగా ఉంటుందని ఎన్‌పీసీఐ పేర్కొంది. యూపీఐపై రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు అవకాశం ఇవ్వడం, విదేశీ దేశాలలో సైతం యూపీఐ సేవలను ప్రారంభించడంతో యూపీఐ చెల్లింపులు భారీగా పెరిగేందుకు దోహదపడింది. ఈ పరిణామంపై ఎన్‌పీసీఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణా రాయ్ స్పందించారు. రూపే క్రెడిట్ కార్డుల మార్కెట్ వాటా మూడేళ్ల క్రితం కేవలం 1 శాతంగా ఉండగా ఇప్పుడు 10 శాతానికి పెరిగిందని ప్రస్తావించారు.కాగా భారత్‌లో యూపీఐ చెల్లింపుల వ్యవస్థను అనేక దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఈ మేరకు ప్రపంచ దేశాలకు భారత్ సహకారం అందిస్తోంది. ఇటీవలే యూఏఈలోని 'అల్ మాయా సూపర్‌మార్కెట్' దేశంలోని తన స్టోర్లలో యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. పారిస్‌లోని ఈఫిల్ టవర్ వద్ద కూడా యూపీఐ పేమెంట్లు అందుబాటులో ఉన్నాయని ఎన్‌పీసీఐ నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, స్వతంత్ర డైరెక్టర్ అజయ్ కుమార్ చౌదరి ప్రస్తావించారు. పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో ఈ పేమెంట్లకు మరింత ఆదరణ పెరిగే అవకాశం ఉందన్నారు. రాబోయే సంవత్సరాల్లో రోజుకు 1 బిలియన్ యూపీఐ లావాదేవీలను సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఆయన చెప్పారు.

## భారత్ లో కొవిడ్ 19 మరణాలపై అంతర్జాతీయ నివేదికను ఖండించిన కేంద్రం

### కొవిడ్ కారణంగా భారత్ లో 11.9 లక్షల మంది మృతి చెందినట్లు అంతర్జాతీయ నివేదిక

### అధ్యయాన్ని ఖండిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటన

### అధ్యయన అంచనాలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయన్న కేంద్రం



**హైదరాబాద్ పెన్ పవర్:** కొవిడ్ 19 కారణంగా మన దేశంలో 11.9 లక్షల మంది మృతి చెందినట్లుగా వెలువడిన అంతర్జాతీయ నివేదికపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కొవిడ్ సమయంలో భారత్‌లో నివేదించిన మరణాల కన్నా చాలా ఎక్కువగా చోటు చేసుకున్నాయని ఓ అంతర్జాతీయ అధ్యయనం ఇటీవల వెల్లడించింది. దీనిపై కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించింది. ఈ అధ్యయాన్ని ఖండిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇది తప్పుదోవ పట్టించే నివేదిక అని పేర్కొంది. అధ్యయనం చేసిన అంచనాలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని, లోపభూయిష్టమైన పద్ధతిలో వారు చేసిన అధ్యయనం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నుంచి సేకరించిన సమాచారాన్ని మొత్తం దేశానికి ఆపాదించలేమని పేర్కొంది. దేశంలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అత్యంత విశ్వసనీయమైనదని పేర్కొంది. దేశంలోని 99 శాతం మరణాలు ఇందులో రికార్డ్ అవుతాయని తెలిపింది. 2019తో పోలిస్తే 2020లో మరణాలు 4.74 లక్షలు పెరిగినట్లు తెలిపింది. అంతకుముందు రెండేళ్లలోనూ ఇలాగే పెరుగుదల నమోదైనట్లు తెలిపింది. 2018లో 4.86 లక్షలు, 2019లో 6.90 లక్షలతో మరణాల్లో అత్యధిక పెరుగుదల నమోదైందని వెల్లడించింది. అత్యధికంగా నమోదైన మరణాలన్నీ కోవిడ్ కారణంగానే అని చెప్పలేమని తెలిపింది. ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉంటాయని వెల్లడించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సహా పలు విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధకులు అధ్యయనం నిర్వహించారు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నివేదికను విశ్లేషించి భారత్‌లో కరోనా విజృంభణ సమయంలో అత్యధిక మరణాలు చోటు చేసుకున్నట్లు నివేదికలో పేర్కొంది. ఈ కథనాన్ని కొన్ని మీడియా సంస్థలు ప్రచురించాయి. దీంతో కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించింది.

# హార్ధిక్ పాండ్యాకు కోచ్ గంభీర్ ఫోన్ కాల్.. సున్నితంగా స్ట్రాంగ్ మెసేజ్!

వన్డే జట్టులో చోటు దక్కాలంటే.. బౌలింగ్ కోటా పూర్తి చేయగలనని నిరూపించుకోవాలంటూ సూచన

విజయ్ హజారే ట్రోఫీ ఆడాలని సూచించినట్టు కథనాలు

శ్రీలంక టూర్‌లో ఒక ఆటగాడిగా మాత్రమే పాండ్యాకు చోటు..

కనీసం వైస్ కెప్టెన్‌గానూ ఛాన్స్ ఇవ్వని సెలక్టర్లు

వన్డే జట్టుకు ఎంపిక చేయని వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2024ను గెలిచిన భారత్ జట్టులో భాగమైనప్పటికీ స్టార్ ఆల్ రౌండర్ హార్ధిక్ పాండ్యా ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో ఇబ్బంది పడుతున్నాడు. తన భార్య నటాసా స్టాంకోవిచ్‌కు విడాకులు ఇచ్చినట్టు రెండు రోజుల క్రితమే ప్రకటించాడు. ఇక టీ20 వరల్డ్ కప్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన పాండ్యాను శ్రీలంక టూర్‌కు కేవలం జట్టులో ఒక ఆటగాడిగా మాత్రమే సెలక్టర్లు ఎంపిక చేయడం ఆసక్తికరంగా మారింది. సూర్య కుమార్ యాదవ్‌కు టీ20 సిరీస్ కెప్టెన్సీని అప్పగించిన సెలక్టర్లు వైస్ కెప్టెన్‌గా యంగ్ ప్లేయర్ శుభ్‌మాన్ గిల్‌కు అవకాశం ఇచ్చారు. ఈ పరిణామం హార్ధిక్ పాండ్యాకు ఏమాత్రం రుచించదని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఇక వన్డే జట్టులో హార్ధిక్ పాండ్యాకు చోటు దక్కకపోవడంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతున్న వేళ ఆసక్తికరమైన కథనం ఒకటి వెలుగులోకి వచ్చింది. వన్డేల్లో పాండ్యా స్థానానికి గ్యారెంటీ లేదని 'హిందుస్థాన్ టైమ్స్' కథనం పేర్కొంది. కోచ్ గౌతమ్ గంభీర్ హార్ధిక్ పాండ్యాకు ఫోన్ చేసి తన బౌలింగ్ ఫిట్‌నెస్‌ని నిరూపించుకోవడానికి విజయ్ హజారే ట్రోఫీ ఆడాలని సూచించినట్టు తెలుస్తోందని కథనం తెలిపింది. ఈ మేరకు బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారని పేర్కొంది. "హార్ధిక్‌కి గంభీర్ ఫోన్ చేశారు. వన్డేలలో పాండ్యా పూర్తిస్థాయి బౌలింగ్ కోటాను పూర్తి చేయాలని గంభీర్ ఎదురుచూస్తున్నారు. ఇదే విషయాన్ని ఫోన్ సంభాషణలో చెప్పారు" అని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పినట్టు 'హిందుస్థాన్ టైమ్స్' కథనం వివరించింది.

**పాండ్యాకు కెప్టెన్సీ ఇవ్వాల్సింది: మహ్మద్ కైఫ్**

టీమిండియా మాజీ స్టార్ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. శ్రీలంక పర్యటనలో పాండ్యాకు టీ20 జట్టు కెప్టెన్సీ ఇవ్వాల్సిందని అన్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు రెండేళ్ల పాటు కెప్టెన్‌గా వ్యవహరించాడని, తొలి సీజన్‌లోనే ఫైనల్ చేర్చి జట్టుని గెలిపించాడని కైఫ్ గుర్తుచేశాడు. హార్ధిక్‌కు టీ20 కెప్టెన్‌గా అనుభవం ఉంది కాబట్టి అతడికి ఇచ్చి ఉండే బాగుండేదని వ్యాఖ్యానించాడు. టీ20 ప్రపంచ కప్‌లో వైస్కెప్టెన్‌గా వ్యవహరించాడని గుర్తుచేశాడు.

# కోచ్ గౌతమ్ గంభీర్ సహాయ సిబ్బంది ఖరారు!

- సహాయక కోచ్‌లుగా అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోస్చాట్ ఖరారయ్యారంటూ కథనాలు
- ద్రావిడ్ ఆధ్వర్యంలో పని చేసిన ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌ను కొనసాగించేందుకు బీసీసీఐ సుముఖంగా ఉందని పేర్కొన్న 'క్రిక్‌బజ్'
- త్వరలోనే ప్రారంభం కానున్న శ్రీలంక టూర్‌తో బాధ్యతలు స్వీకరించనున్న నూతన కోచింగ్ సిబ్బంది




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సహాయ కోచ్‌లుగా అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోస్చాట్‌లను నియమించేందుకు బీసీసీఐ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. టీమ్ మేనేజ్‌మెంట్ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయక పోయినప్పటికీ శ్రీలంకతో జరగనున్న టీ20, వన్డే సిరీస్‌ల నుంచి వీరిద్దరూ గంభీర్‌తో కలిసి బాధ్యతలు స్వీకరిస్తారని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. కాగా అభిషేక్ నాయర్ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా ఉన్నాడు. ఇక ఐర్లాండ్ మాజీ ఆటగాడైన ర్యాన్ టెన్ డోస్చాట్ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు గతంలో ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. మరోవైపు రాహుల్ ద్రావిడ్ ఆధ్వర్యంలో ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేసిన తెలుగు వ్యక్తి టి.దిలీప్‌ను కూడా నూతన సహాయక సిబ్బందిలో కొనసాగించాలని బీసీసీఐ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. కాగా బౌలింగ్ కోచ్ నియామకంపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్ బౌలర్ మోర్నీ మోర్కెల్‌ను బలమైన పోటీదారుగా బీసీసీఐ పరిగణిస్తున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఆడినప్పుడు మోర్కెల్‌తో గంభీర్ కలిసి పనిచేశాడు. 2014, 2016 ఐపీఎల్ సీజన్లలో గంభీర్ కెప్టెన్సీలో మోర్కెల్ ఆడాడు. బౌలింగ్ కోచ్‌పై స్పష్టత రానప్పటికీ దిలీప్, అభిషేక్ నాయర్‌లతో కలిసి కోచ్ గంభీర్ శ్రీలంక పర్యటనకు వెళ్లనున్నాడని 'క్రిక్‌బజ్' కథనం పేర్కొంది. కాగా ర్యాన్ టెన్ డోస్చాట్ జట్టుతో ఎప్పుడు కలుస్తాడనేది తెలియరాలేదు. ప్రస్తుతం జరుగుతున్న 'మేజర్ లీగ్ క్రికెట్'లో ఎల్‌ఏ నైట్ రైడర్స్ కోచింగ్ స్టాఫ్‌లో సభ్యుడిగా ర్యాన్ టెన్ పనిచేస్తున్నాడు.

# ఈ నెల 22న శ్రీలంక పర్యటనకు వెళ్లనున్న టీమిండియా... ఈ నెల 27న తొలి మ్యాచ్

**శ్రీలంకలో 3 టీ20లు, 3 వన్డేలు ఆడనున్న టీమిండియా**

**జులై 27 నుంచి టీ20 సిరీస్, ఆగస్టు 2 నుంచి వన్డే సిరీస్**

**టీ20ల్లో ఆడే టీమిండియా కెప్టెన్ గా  సూర్యకుమార్ యాదవ్**

**వన్డేల్లో రోహిత్ సారథ్యం**

**శ్రీలంక పర్యటన ద్వారా టీమిండియా కోచ్ గా బాధ్యతలు చేపట్టనున్న గంభీర్**




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20, వన్డే సిరీస్ లు ఆడేందుకు టీమిండియా ఈ నెల 22న శ్రీలంక పయనం కానుంది. టీ20 సిరీస్ లో సూర్యకుమార్ టీమిండియాకు కెప్టెన్ గా వ్యవహరించనుండగా, వన్డేల్లో ఎప్పట్లాగానే రోహిత్ శర్మ నాయకత్వం వహిస్తాడు. ఇటీవల వరల్డ్ కప్ గెలిచిన అనంతరం టీ20 ఫార్మాట్ కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.  కాగా, శ్రీలంక పర్యటనలో టీ20 సిరీస్ 27 నుంచి జరనుగంది. ఆగస్టు 2 నుంచి వన్డే మ్యాచ్ లు జరగనున్నాయి. ఈ పర్యటనలో టీమిండియా 3 టీ20 మ్యాచ్ లు, 3 వన్డేలు ఆడనుంది. కాగా, టీమిండియా కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఈ పర్యటనతోనే బాధ్యతలు అందుకోనున్నాడు. జులై 22న దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.

# గుండెల్లో గుచ్చుకునేలా ఆ నవ్వేంటి మీనాక్షి..



నియాన్ మోనోకిని లో సోనాలి రౌత్ సిజిల్స్



ఇటీవల కాలంలో బాగా పాపులర్ అయిన బ్యూటీలలో మీనాక్షి చౌదరి టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు. ఈ బ్యూటీ ఎలాంటి డ్రెస్ లో కనిపించినా కూడా కుర్రాళ్ళ మనసును ఇట్టే దోచేస్తూ ఉంటుంది. సినిమాల కంటే ఆమె సోషల్ మీడియాలోనే తన గ్లామరస్ ఫోటోలతో ఎక్కువగా తన ఫ్యాన్ ఫాలోవర్స్ ను పెంచుకుందని చెప్పవచ్చు. మిస్ ఇండియా హర్యానా లో కూడా అమ్మడు కిరీటం అందుకున్న విషయం తెలిసిందే.

మోడల్ గా మంచి గుర్తింపును అందుకున్న తర్వాత సినిమా ఇండస్ట్రీలో చాలా తొందరగానే అడుగుపెట్టింది. 2019లో హిందీలో అప్ స్టార్ట్స్ అనే సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైంది. ఇక ఆ తర్వాత టాలీవుడ్ వైపు యు టర్న్ తీసుకున్న ఈ బ్యూటీ సక్సెస్ ఫెయిల్యూర్ తో సంబంధం లేకుండా అవకాశాలను సొంతం చేసుకుంది. తెలుగులో ఆమె చేసిన మొదటి సినిమా ఇచ్చట వాహనములు నిలుపరాదు.

ఆ తర్వాత రవితేజ ఖిలాడి సినిమాలో కూడా నటించింది. ఇక హిట్ 2, గుంటూరు కారం సినిమాలలో కూడా మెరిసిన మీనాక్షి ఓ వర్గం ప్రేక్షకులను ఎంతగానో ఎట్రాక్ట్ చేసింది. ఇక సోషల్ మీడియాలో అప్పుడప్పుడు పోస్ట్ చేస్తున్న ఫోటోలు చూస్తే ఎవరైనా సరే షాక్ అవ్వాల్సిందే. అమ్మడు తన నవ్వుతోనే కుర్రాళ్ళ గుండెలను మాయ చేస్తోంది అని చెప్పవచ్చు.రీసెంట్ గా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలలో పెద్దగా గ్లామర్ హైలెట్ కాకపోయినప్పటికి కూడా తన నవ్వుతూనే మైమరిపించింది. దీంతో ఫాలోవర్స్ చాలా పాజిటివ్ గా రియాక్ట్ అవుతూ ఉన్నారు. నీ నవ్వుతూనే గుండెల్లో గుచ్చేస్తున్నావు అంటూ మరికొందరు కామెంట్ చేస్తున్నారు. ఇక ఈ బ్యూటీ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం చాలా బిజీగా కనిపిస్తోంది.

మట్కా సినిమాతో పాటు లక్కీ భాస్కర్ సినిమా కూడా లిస్టులో ఉంది. ఇక విజయ్ %+ూాు% సినిమాలో కూడా ఒక స్పెషల్ పాత్రలో కనిపించబోతోంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర సినిమాలో కూడా ఒక క్యారెక్టర్ చేయబోతున్నట్లు రీసెంట్ గా వివరణ ఇచ్చింది. మొత్తానికి అమ్మడు ఇండస్ట్రీలో అయితే చాలా బిజీగా కనిపిస్తోంది. ఇక రాబోయే సినిమాలలో ఏ ఒక్కటి సక్సెస్ అయినా కూడా ఆమె రేంజ్ అమాంతంగా పెరిగిపోతుంది అని చెప్పవచ్చు. మరి ఈ బ్యూటీ లక్కు ఎలా ఉందో తెలియాలి అంటే మరి కొంత కాలం ఆగాల్సిందే.



అభిమానులు షెహనాజ్ గిల్ రెడ్ డ్రెస్ లుక్‌ని ఇష్టపడుతున్నారు!

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.  Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965,  RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com